E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



బంగారు రాఖీ కొంటున్నారా » 3లో

(తేదీ) 021-08-2025 శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

## అధికారంలోకి వచ్చాక.. మిమ్మల్ని వదలం




» అధికారంలోకి వచ్చాక..మిమ్మల్ని వదలం
» ఓటర్ల జాబితాల్లో మోసాలెందుకు?
» జవాబులివ్వకుండా మాకు బెదిరింపులా?
» బీజేపీ ఏజెంటులా ఎందుకు పనిచేస్తున్నారు?
» ఎన్నికల అధికారులపై రాహుల్‌గాంధీ ఆగ్రహం
» బెంగళూరులో 'ఓటు అధికార ర్యాలీ'

బెంగళూరు, ఈ కబురు: ఎన్నికల మోసాలతో ప్రమేయం ఉన్న ప్రతి ఎన్నికల అధికారీ.. పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టంచేశారు. ఏదో ఒక రోజు తాము అధికారంలోకి వస్తామని.. అప్పుడు మిమ్మల్ని ఏం చేస్తామో చూడండని హెచ్చరించారు. ప్రతి ఎన్నికల కమిషనర్, అధికారి దీనిని గుర్తుంచుకోవాలన్నారు. ఎవరెంత సీనియర్ అధికారి అయినా.. జూనియర్ అయినా లెక్కచేసేది లేదని చెప్పారు. శుక్రవారం బెంగళూరులో ఆయన ఓటు అధికార ర్యాలీలో ప్రసంగించారు. గురువారం ఢిల్లీలో విలేకరుల భేటీలో తాను చూపిన డాక్యుమెంట్లపై సంతకం చేసి.. తమకు ప్రమాణ పత్రం సమర్పించాలని, అప్పుడు ఆయన ఆరోపణలపై విచారణ చేపడతామని ఈసీ చేసిన ప్రకటనపై రాహుల్ తీవ్ర స్థాయిలో స్పందించారు. తాను రాజ్యాంగాన్ని కాపాడతానని పార్లమెంటులో ప్రమాణం చేశానని గుర్తుచేశారు. ఓట్ల చోరీ ఆరోపణను పునరుద్ఘాటించారు

తరువాయి 2లో

## సుంకాల సమస్య తేలితేనే..



» వాషింగ్టన్, ఈ కబురు: భారత్‌పై ఇప్పటికే రెండు దఫాల్లో 50 శాతం సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇంకా శాంతించలేదు. సుంకాల సమస్య పరిష్కారమైతేనే భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలకు సిద్ధమవుతామని ప్రకటించారు. 'ఆ సమస్య తేలనంత వరకూ భారత్‌తో సంప్రదింపులు ఉండవు' అని శ్వేతసౌధం ఓవల్ ఆఫీసులో గురువారం తెలిపారు.

తరువాయి 3లో

## రష్యాతో బంధం మరింత బలోపేతం



» మోదీపుతిన్ నిర్ణయం..
» ఇరువురు నేతల ఫోన్ సంభాషణ
» అమెరికా సుంకాల మోత వేళ కీలక పరిణామం

తరువాయి 3లో

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్
ఎన్‌జీఆర్ఐ ఆధ్వర్యంలో ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే
సమ్మక్కసాగర్ అనుమతులు సాధించాలి
నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఈ కబురు: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం పనుల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. టన్నెల్ తవ్వకాన్ని బ్లాస్టింగ్ విధానంలో చేయాలని నిర్ణయం తీసుకున్నందునా.. సవరించిన ప్రతిపాదనలకు పరిపాలనపరమైన అనుమతులతో పాటు నిధుల కోసం త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం కానున్నట్లు ప్రకటించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం అనంతరం ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీ సూచనలను అనుగుణంగా పునరుద్ధరణ ప్రక్రియ మొదలు పెట్టబోతున్నట్లు తెలిపారు.

తరువాయి 3లో

కాలం కలిసిరావట్లేదన్న బ్యూటీ.. మెగాస్టార్ సినిమాతోనైనా దశ తిరిగేనా? » 5లో



రష్యా చమురుపై ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు రాలేదు: హెచ్‌పీసీఎల్ » 4లో



## ప్రతీ చుక్క వరద మూసీకి చేరాలి



» చెరువులు, నాలాల్ని మూసీకి అనుసంధానించాలి
» రాజధాని వరదకు మూసీ పునరుజ్జీవనమే పరిష్కారం
» అప్పుడే నగరంలో కాలనీలన్నీ సురక్షితం
» భారీ వర్షాలు పడినాతట్టుకునేలా ప్రణాళికలుండాలి
» హైదరాబాద్ వర్షాలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

తరువాయి 2లో

## క్షమాపణ చెప్పకుంటే కోర్టుకు లాగుతా



» నీ చిల్లర వ్యాఖ్యలను వెనక్కి తీసుకో..
» 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలి.. కేంద్ర మంత్రి
» బండి సంజయ్‌కి కేటీఆర్ హెచ్చరిక

ఈ కబురు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తనపై చేసిన అడ్డగోలు, చిల్లర వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బండి సంజయ్ 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయనను కోర్టుకు లాగుతామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు హాజరైన అనంతరం దిల్‌కుషా అతిథిగృహం వద్ద బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

తరువాయి 2లో

## చొరబాటుదారులు

కాంగ్రెస్‌ఆర్జేడీ ఓటర్లు

అమిత్‌షా ఆరోపణ



» 3లో

## సీబీఐ విచారణ జరిపించాలి



## ఓట్ చోరీపై దేశవ్యాప్త ఉద్యమం





» జయప్రకాశ్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవం' స్థాయిలో నిర్మాణానికి 'ఇండియా' యోచన
» దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన..రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' ప్రజెంటేషన్
» బీజేపీకి నష్టమే అంటున్న రాజకీయ వర్గాలు
» ఓటరుకార్డుఆధార్ అనుసంధానంతో బోగస్ ఓట్లకు చెక్‌పడుతుంది: ఈసీ వర్గాలు

న్యూఢిల్లీ,ఈ కబురు: దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో ఓట్లను కొల్లగొట్టేందుకు బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కు అయిందన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం, దాని పరిధిలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల జాబితా ఆధారంగా ఆయన ఇచ్చిన 'ఓట్ చోరీ' ప్రజెంటేషన్‌కు మంచి స్పందన వచ్చిందని ఇండి కూటమి భావిస్తోంది. దీనిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీని ఎండగట్టేందుకు సిద్ధమైంది. గతంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ నిర్మించిన 'సంపూర్ణ విప్లవం' ఉద్యమం తరహాలో దేశవ్యాప్తంగా ప్రజా ఆందోళనను లేవనెత్తాలని ఇండి కూటమి నేతలు నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

తరువాయి 2లో

ఆ ఒక్క వ్యాయామం చేస్తూ 9కేజీలు తగ్గిన కీర్తిసురేష్.డైట్ కూడా అక్కర్లేదట » 5లో



దాయాదుల పోరు.. ఆ రెండింటికీ పోలికే లేదు: ఎమిరేట్స్ క్రికెట్ సీవోవో » 6లో




## ఎస్‌సీవో సదస్సుకు మోదీ.. స్వాగతించిన చైనా



తరువాయి 2లో

ఈ-కబురు
09- 08 -2025
శనివారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# అధికారంలోకి వచ్చాక..మిమ్మల్ని వదలం




లోక్‌సభ ఎన్నికలను దొంగిలించేందుకు ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయన్నారు. 'నేను గురువారం విడుదల చేసిన డేటాను చూసి ప్రజలు ప్రశ్నించడం మొదలుపెట్టేసరికి.. ఈసీ తన వెబ్‌సైట్‌ను మూసివేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్‌లలోని ఈసీ వెబ్‌సైట్లను మూసివేశారు. ప్రజలు నిలదీస్తే తమ వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుందని వారికి తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఈసీకి ఆయన ఐదు ప్రశ్నలు సంధించారు. తనను బెదిరించడానికి బదులు వీటికి బదులివ్వాలని స్పష్టంచేశారు. 'డిజిటల్ మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఓటర్ల జాబితాలను మీరెందుకు ఇవ్వడం లేదు? వీడియో ఆధారాలను మీరెందుకు ధ్వంసం చేస్తున్నారు? ఓటర్ల జాబితాల్లో భారీగా ఎందుకు మోసాలకు పాల్పడుతున్నారు? మా ప్రశ్నలకు జవాబులివ్వకుండా మమ్మల్ని ఎందుకు బెదిరిస్తున్నారు? ఈసీ బీజేపీ ఏజెంటులా ఎందుకు పనిచేస్తోంది' అని అడిగారు.

ఎన్నికల చోరీపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కర్ణాటకలోని తమ పార్టీ ప్రభుత్వాన్ని రాహుల్ కోరారు. మోదీని 25 సీట్ల మార్జిన్‌తో ఎన్నికైన ప్రధానిగా పేర్కొన్నారు. 'దేశవ్యాప్తంగా మేం కోరిన ఎలక్ట్రానిక్ ఓటర్ డేటా గనుక మాకిస్తే.. భారత ప్రధాని దొంగతనం ద్వారా ఆ పదవిని అంటిపెట్టుకుని ఉన్నారని రుజువుచేస్తాం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మా కూటమి గెలిచింది. అయితే 4 నెలలకే అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయం సాధించింది. ఏం జరిగిందో తెలుసుకోవడానికి ప్రయత్నించినప్పుడు.. కోటి మంది కొత్త ఓటర్లు ఓటేశారని వెల్లడైంది. ఆ కొత్త ఓట్లన్నీ బీజేపీకి పడ్డాయి. కొత్త ఓటర్లు ఓటేసిన చోటల్లా ఆ పార్టీ గెలిచింది. కానీ మా కూటమి ఓట్లు తగ్గలేదు. లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లే అసెంబ్లీ ఎన్నికల్లోనూ వచ్చాయి. నిజాలు తవ్వేందుకు మాకు 6నెలలు పట్టాయి. చిందరవందరగా పడేసిన ఎన్నో కాగితాల నుంచి మేం వెలికితీసిన డేటా.. ఓట్ల చౌర్యమనే నేరానికి ఆధారం'అని చెప్పారు. ఓటర్ల జాబితా సాఫ్ట్‌కాపీ ఇవ్వాలని ఈసీని అడిగితే తిరస్కరిస్తోందన్నారు. రాహుల్ రాజ్యాంగ ప్రతిని చేతబట్టుకుని.. ఇందులో వేల శతాబ్దాల చరిత్ర గలిగిన సిద్ధాంతం ఉందని సభలో చెప్పారు. 'బీజేపీ సిద్ధాంతం రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైనది. డబ్బులిచ్చి కర్ణాటకలో మా ప్రభుత్వాన్ని తస్కరించింది' అని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలనూ దొంగిలించిందని పూర్తి నమ్మకంతో, ఆధారాలతో చెబుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ర్యాలీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 2019 లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాల కారణంగా గుల్బర్గాలో తాను ఓడిపోయానన్నారు.

### మీ ఆరోపణలు నిజమైతే డిక్లరేషన్‌పై సంతకం చేయండి.. లేదంటే క్షమాపణ చెప్పండి: ఈసీ

రాహుల్‌గాంధీ ఆరోపణలను ఈసీ మరోసారి ఖండించింది. ఆయన ఆరోపణలు నిజమైతే డిక్లరేషన్‌పై సంతకం చేసి ఓటర్ల జాబితాలో తప్పుగా వేసిన ఎంట్రీలు, తొలగింపుల వివరాలను తమతో పంచుకోవాలని పేర్కొంది. 'మీ విశ్లేషణపై మీకు నమ్మకముంటే.. మీ ఆరోపణలు నిజమని భావిస్తే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి.. తప్పుగా చేర్చిన, తొలగించిన ఓటర్ల వివరాలివ్వడానికి ఇబ్బంది ఉండకూడదు. డిక్లరేషన్‌పై సంతకం చేయలేదంటే.. ఆయన అనాలిసిస్‌పై ఆయనకే నమ్మకంలేనట్లు లెక్క. చేసిన నిరాధార ఆరోపణలకు ఆయన జాతికి క్షమాపణ చెప్పాలి'అని ఈసీ వర్గాలు శుక్రవారం పేర్కొన్నాయి. తమ వెబ్‌సైట్లను మూసివేశామన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. అన్ని భేషుగ్గా పనిచేస్తున్నాయని పేర్కొంది.

# చొరబాటుదారులు కాంగ్రెస్‌ఆర్జేడీ ఓటర్లు అమిత్‌షా ఆరోపణ



**సీతామఢీ(బిహార్)ఈ కబురు: బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులే ప్రతిపక్ష కాంగ్రెస్-ఆర్జేడీ కూటమికి ఓటుబ్యాంకు అని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ఆరోపించారు. చొరబాటుదారులతో కూడుకున్న ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ఆయన సీతామఢీలో జరిగిన ఒక ర్యాలీని ఉద్దేశించి పేర్కొన్నారు. "ఓటరు జాబితా ముమ్మర సవరణ గతంలో అనేక పర్యాయాలు జరిగింది. కానీ రాహుల్ గాంధీ కానీ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కానీ దాన్ని విమర్శించలేదు. తమ ఓటు బ్యాంకును రక్షించుకోడానికే వారు ఇప్పుడు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నారు" అని హోం మంత్రి అన్నారు. స్థానికుల ఉద్యోగాలను హరిస్తున్న అక్రమ ఓటర్లను రాహుల్‌గాంధీ, లాలూ ప్రసాద్ (యాదవ్)లు రక్షించాలని చూస్తున్నట్టు ఆయన ఆరోపించారు.**

**రామాయణ కాలంలో జనక మహారాజు సీతను కనుగొన్న ప్రదేశంగా భక్తులు విశ్వసించే "పునౌరా ధామ్" అభివృద్ధికి రూ.882.87 కోట్లతో చేపట్టిన పనులకు అమిత్‌షా ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు. భూమిపూజ అనంతరం అమిత్‌షా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలో రూ.137 కోట్లు పాత ఆలయ పునరుద్ధరణకు, మిగిలిన మొత్తం పర్యాటక సదుపాయాల అభివృద్ధికి వెచ్చిస్తామని అధికారి ఒకరు తెలిపారు. ఈ సందర్భంగా అమిత్‌షా సీతామఢీ - ఢిల్లీ అమృత్ ఎక్స్‌ప్రెస్‌ను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు.**

# ప్రతీ చుక్క వరద మూసీకి చేరాలి

హైదరాబాద్, ఈ కబురు: హైదరాబాద్ మహా నగరంలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మూసీ పునరుజ్జీవనమే మనకున్న చక్కటి పరిష్కార మార్గమని చెప్పారు. వరద నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగించి, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా ఉండేందుకు, జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండేందుకు యుద్ధ ప్రాతిపదికన శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు. తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల అవసరాలను అంచనా వేసుకొని అభివృద్ధి చేయడానికి కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఢిల్లీ నుంచి శుక్రవారం హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి ముందురోజు రాత్రి నగరంలో కురిసిన వర్షం, తలెత్తిన ఇబ్బందులు, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి ఏకంగా 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ట్రాఫిక్ స్తంభించింది. లోతట్టు ప్రాంతాలకు వరద ముంపు పరిస్థితి ఏర్పడింది. తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం పడటంతో జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. మూడు నాలుగు నెలల వర్షం మొత్తం ఒకే రోజున కుమ్మరించటంతో ఇబ్బందులు వచ్చాయనే అంశం చర్చకు వచ్చింది. వాతావరణ మార్పులే అందుకు ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదని, ఒక్కోసారి కొన్నిచోట్ల 20 సెంటీమీటర్ల వర్షం నమోదవుతోందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి కేవలం 4 గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, జీహెచ్ఎంసీ పరిధిలో 16 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని తెలిపారు. ఎంత వర్షం పడినా నగరంలో ఎక్కడా నీరు నిలబడకుండా, వరద నీటితో ముంపునకు గురవకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా సురక్షితంగా ఉండేలా పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలన్నారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరివాహక ప్రాంతంతో పాటు నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలన్నీ సురక్షితంగా ఉంటాయని చెప్పారు. వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందునే నగరంలో ప్రస్తుత పరిస్థితి తలెత్తిందని అధికారులు అన్నారు.

### వరద నీరు మూసీకి చేరేలా...

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లోని వరదనీరు అన్ని వైపుల నుంచి మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హుస్సేన్ సాగర్, దుర్గం చెర్వు, మీర్ అలంతో పాటు ప్రతీ చెరువు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టీపీ (సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ల) ద్వారా శుద్ధి చేయాలని, మూసీలో స్వచ్ఛమైన నీరు మాత్రమే ఉండేలా చూడాలని చెప్పారు. నగరంలో ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటు నుంచి మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలని స్పష్టం చేశారు. మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో హైదరాబాద్‌లో నీటి కష్టాలు తీరతాయని చెప్పారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకునే వీలుంటుందని చెప్పారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలని ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని చెప్పారు. పాతనగరంలో పాదచారుల జోన్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలన్నారు. చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో బహుళ అంతస్తుల పార్కింగ్ జోన్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు.



మొదటి పేజీ తరువాయి

# ఓట్ చోరీపై దేశవ్యాప్త ఉద్యమం

కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని, ఎన్నికలు జరగనున్న బిహార్‌లో దూకుడుగా వ్యవహరించాలని భావిస్తున్నట్టు సమాచారం. గురువారం సాయంత్రం రాహుల్ నివాసంలో విందు భేటీలో పాల్గొన్న కూటమి నేతలంతా.. ఎన్నికల సంఘంపై రాహుల్ దాడి తీరును ప్రశంసించినట్టు తెలిసింది.




### ప్రజల్లోకి వెళ్తే బీజేపీకి నష్టమే?

రాహుల్ చేసిన ఆరోపణలు విపరీతంగా ప్రజల్లోకి వెళ్లడం, సాధారణ ప్రజలు దీనిపై మాట్లాడుకోవడం, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం లభించడంపై అన్ని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్ ఆరోపణలు ప్రజల్లో ఏమాత్రం ప్రభావం చూపినా.. బీజేపీ పట్ల వ్యతిరేకతగా మారే అవకాశం ఉందని నేతలు అంటున్నారు. 2జీ కుంభకోణంతో నష్టం కేవలం ఊహాత్మకమేనని అప్పట్లో కాంగ్రెస్ నేతలు వాదించినా... కాంగ్రెస్ వేలకోట్ల అవినీతికి పాల్పడినట్టు ప్రజల్లోకి వెళ్లిందని, అది బీజేపీకి అనుకూలంగా మారిందని చెబుతున్నారు. ఇప్పుడు బీజేపీ ఓట్ల చోరీ చేయకపోయినా.. ప్రజల్లో ఆ అభిప్రాయం కలిగించడంలో కాంగ్రెస్ సఫలమైతే బీజేపీ దాని పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

### లోపాలు సాధారణమే.. చర్చే అసాధారణం..

రాహుల్ ఆరోపణలు, ప్రజెంటేషన్‌పై ప్రభుత్వవర్గాల్లో, మంత్రిత్వ కార్యాలయాల్లో విస్తృతంగా చర్చలు జరుగుతున్నట్టు ఓ అధికారి తెలిపారు. నిజానికి రాహుల్ లేవనెత్తిన అంశాలు.. దేశవ్యాప్తంగా స్థానికంగా జరుగుతున్నవేనని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇంటి నంబర్లు సరిగా ఉండవని, అధికారులు ఏదో ఒకటి రాసుకుంటారని, దాన్ని బట్టి బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కైనట్లు భావించలేమని స్పష్టంచేశారు. కానీ ఈ అంశాన్ని సరైన సమయంలో లేవనెత్తడం, బాగా ప్రజెంటేషన్ చేయడంతో ఎన్నికల సంఘం, బీజేపీ విశ్వసనీయతపై సందేహాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. రాహుల్ చెప్పినట్టు బోగస్ ఓట్లు పడ్డాయా అనేది ఎన్నికల్లో పార్టీ ఏజెంట్లు టిక్ చేసిన ఓటర్ల జాబితాలను చూస్తే వెల్లడవుతుందని, కానీ అదంతా జరిగి ఉండే అవకాశం లేదని చెప్పారు.

### ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలి

రాహుల్ ఆరోపణలతో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలంటే.. ప్రధానమంత్రి ముందుకొచ్చి అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలని ఓ సీనియర్ రాజకీయ నాయకుడు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతను పునరుద్ధరించాలంటే కమిషనర్ల నియామకం పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు మోదీ ముందుకు రావాలన్నారు.

### ఓటరుకార్డుఆధార్ అనుసంధానంతో పరిష్కారం!

ఓటరుకార్డును ఆధార్‌తో అనుసంధానం చేస్తే బోగస్, డూప్లికేట్ ఓట్ల సమస్యకు చెక్ పడుతుందని ఎన్నికల కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ నుంచి పంచాయతీల వరకు ఒకే ఓటర్ల జాబితాను అనురించడంతోనూ ప్రయోజనం ఉంటుందని అంటున్నాయి. ఇక దేశంలో పౌరులకు అన్ని అవసరాలకు ఉపయోగపడేలా ఒకే కార్డును జారీ చేయాలనే ప్రతిపాదనపై చాలా రోజులుగా చర్చ జరుగుతోందని.. అది అమల్లోకి వస్తే ఓట్ల సమస్య తీరుతుందని స్పష్టం చేస్తున్నాయి.

మొదటి పేజీ తరువాయి

# రష్యాతో బంధం మరింత బలోపేతం



ఈ కబురు,ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడుతున్న వేళ...రష్యాతో స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ అడుగులువేస్తోంది. భారత ప్రధాని మోదీ శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక బంధం బలోపేతంతో పాటు పెట్టుబడులు, వాణిజ్యం, ఆర్థిక విషయాలపై చర్చించుకున్నారని ఢిల్లీ, మాస్కోల నుంచి విడివిడిగా విడుదలైన అధికారిక ప్రకటనలు తెలిపాయి. ఇరుదేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో వారు తమ నిబద్ధతను చాటుకున్నట్లు తెలిసింది. ఉక్రెయిన్‌తో ఘర్షణ తాజా పరిస్థితిని పుతిన్ వివరించగా శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న తన సూచనను ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. 'మిత్రుడు పుతిన్‌తో ఫలప్రదమైన సంభాషణ కొనసాగింది. పలు అంశాలపై వివరంగా మాట్లాడుకున్నాం. ఉక్రెయిన్ తాజా పరిణామాలు వివరించినందుకు కృతజ్ఞతలు' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రధాని మోదీ తెలియజేశారు. ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిని సమీక్షించామన్నారు. ఈ ఏడాది చివర్లో భారత్ పర్యటనకు వచ్చే పుతిన్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నట్లు రాసుకొచ్చారు. పుతిన్ భారత్ పర్యటన తేదీలపై కసరత్తు చేస్తున్నట్లు మాస్కో పర్యటనలో ఉన్న జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ వెల్లడించారు.

### జిన్‌పింగ్, పుతిన్ సంభాషణ

ఉక్రెయిన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో ఫోన్‌లో సంభాషించారు. ఉక్రెయిన్ సంక్షోభం తాజా పరిస్థితిని వివరించడంతో పాటు ఇటీవల ఇదే అంశంపై అమెరికాతో కొనసాగిన సంప్రదింపుల వివరాలను జిన్‌పింగ్‌కు పుతిన్ తెలిపినట్లు రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నెలాఖరులో చైనాలో నిర్వహించే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు పుతిన్ హాజరుకానున్నారు.

# ఎస్‌సీవో సదస్సుకు మోదీ.. స్వాగతించిన చైనా



ఈ కబురు: ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సదస్సు లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ సిద్ధమవుతున్నారనే వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించి షెడ్యూల్ ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై స్పందించిన బీజింగ్.. ప్రధాని మోదీ పర్యటనను స్వాగతించింది. ఈ శిఖరాగ్ర సమావేశం సభ్యదేశాల మధ్య సంఘీభావం, స్నేహం, ఫలవంతమైన ఫలితాలకు వేదిక కానుందని ఆశాభావం వ్యక్తం చేసింది.ద్వైపాక్షిక వార్షిక సదస్సులో భాగంగా ప్రధాని మోదీ ఆగస్టు 30న జపాన్‌లో పర్యటించనున్నారు. అనంతరం ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లనున్నారు. ఇదే విషయంపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గువా జియాకున్ స్పందిస్తూ.. ఎస్‌సీవో సభ్యదేశాలు సహా 20 దేశాల నేతలు, 10 అంతర్జాతీయ సంస్థల అధిపతులు ఇందుకు హాజరుకానున్నారని చెప్పారు. అయితే, ప్రధాని జపాన్, చైనా పర్యటనలకు సంబంధించి అధికారికంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు.ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్‌చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

# సుంకాల సమస్య తేలితేనే..

వాషింగ్టన్, ఈ కబురు: భారత్‌పై ఇప్పటికే రెండు దఫాల్లో 50 శాతం సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇంకా శాంతించలేదు. సుంకాల సమస్య పరిష్కారమైతేనే భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలకు సిద్ధమవుతామని ప్రకటించారు. 'ఆ సమస్య తేలనంత వరకూ భారత్‌తో సంప్రదింపులు ఉండవు' అని శ్వేతసౌధం ఓవల్ ఆఫీసులో గురువారం తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అమెరికా మరిన్ని వెసులుబాట్లు కోరుకుంటుందా అని విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ జవాబిచ్చారు. ఈ నెల 25న ఢిల్లీలో భారత్, అమెరికాల మధ్య ఆరో దఫా ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు జరగాల్సి ఉంది. వ్యవసాయం, పాల ఉత్పత్తుల అంశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నందునే భారత్‌పై 25 శాతం సుంకాలతో పాటు అదనంగా పెనాల్టీ విధిస్తున్నట్లు గత వారం ప్రకటించిన ట్రంప్ మళ్లీ అదే కారణాన్ని చూపుతూ మరో 25 శాతం సుంకాల భారాన్ని మోపారు. అంటే రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేంత వరకూ వాణిజ్య ఒప్పందంపై భారత్‌తో చర్చలు కూడా జరపరాదన్నది ట్రంప్ ఆలోచనగా తెలుస్తోంది.



# బంగారు రాఖీ కొంటున్నారా



**ఈ కబురు: సోదరుడి జాతకంలో చంద్రుడి వల్ల కలిగే సమస్యలకు వెండి రాఖీ పరిష్కారమని కొందరు నమ్ముతూ ఉంటారు. అంతే కాకుండా మానసిక ప్రశాంతతకు వెండిని చిహ్నంగా కూడా భావిస్తూ ఉంటారు. ఇక బంగారాన్ని తమ సోదరుడికి ఇచ్చే బహుమతిగా కొందరు భావిస్తూ ఉంటారు. ఇంకొందరు రాఖీ పండుగకు బంగారపు రాఖీలు కొని దాచుకుంటూ ఉంటారు.**

వెండి లేదా బంగారు రాఖీలను కొనే ముందు తీసుకో వాల్సిన జాగ్రత్త లేమిటో తెలుసుకుందాం..

సాధారణంగా వెండి లేదా బంగారపు రాఖీలు 14 క్యారెట్లు లేదా 18 క్యారెట్లతో తయారుచేస్తారు. ఇలా తయారుచేసిన రాఖీలు ఏవైనా వస్తువులు తయారు చేయించు కోవటానికి వీలుగా ఉంటాయి.రాఖీ కట్టించుకొనే వ్యక్తి వ్యక్తిత్వానికి తగినట్లుగా రాఖీలను కొంటే బావుంటుంది. ఈ మధ్యకాలంలో 'ఓం' చిహ్నంతో ఉన్న రాఖీలకు మంచి డిమాండ్ ఉంది.

కొన్ని రకాల బంగారు లేదా వెండి రాఖీలను పెండెంట్‌ల కింద కూడా వాడుకోవచ్చు.

షాపుకు వెళ్లే ముందే ఎన్ని గ్రాముల బంగారం లేదా వెండి రాఖీని కొనాలనే విషయాన్ని నిర్ణయించుకొని వెళ్తే మంచిది.

ఈ మధ్యకాలంలో పేరున్న జ్యూయలరీ సంస్థలన్నీ వెండి లేదా బంగారు రాఖీలను విక్రయిస్తున్నాయి. అలాంటి సంస్థల నుంచి కొనుగోలు చేస్తే గ్యారంటీ కూడా ఉంటుంది.

# ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ రూట్‌పై అధ్యయనం కోసం డెన్మార్క్‌కు చెందిన కంపెనీతో జియో ఫిజికల్ సర్వే చేయించాలని మంత్రి ఆదేశించారు. రూ.2.36 కోట్లతో వ్యయంతో ఈ సర్వే చేయనున్నారు. ఈ పనులను జాతీయ భూభౌతిక పరిశోధన కేంద్రానికి (ఎన్‌జీఆర్ఐ) అప్పగించారు. ఇక, సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టుకు వరద కారణంగా ఛత్తీస్‌గఢ్‌లో 100 ఎకరాలు ముంపునకు గురవుతుందని ఐఐటీఖరగ్‌పూర్ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా.. ఆ 100 ఎకరాల భూమిని సేకరించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఆ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ పొందాలని సూచించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెస్తేనే డీపీఆర్‌కు అనుమతులిస్తామని సీడబ్ల్యూసీ తేల్చిచెప్పడంతో వెంటనే ఎన్‌వోసీ పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.



# క్షమాపణ చెప్పకుంటే కోర్టుకు లాగుతా



ఈ కబురు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తనపై చేసిన అర్ధ గోల, చిల్లర వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బండి సంజయ్ 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయనను కోర్టుకు లాగుతామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు హాజరైన అనంతరం దిల్‌కుషా అతిథిగృహం వద్ద బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు.దీనిపై కేటీఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఫోన్ ట్యాపింగ్‌పై బండి సంజయ్ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉన్నా నిరూపించాలని నేను సవాల్ విసురుతున్నా. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్న బండి సంజయ్‌కి నిఘా వ్యవస్థ ఎలా పని చేస్తుందో కనీస అవగాహన లేదు. నిఘా వ్యవస్థల నిర్వహణపై కనీస పరిజ్ఞానం కూడా లేదు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ అబద్ధాలు, అనుచిత వ్యాఖ్యలు, ప్రకటనలు అన్ని హద్దులు దాటాయి. ఇంత దిగజారుడు ఆరోపణలు, చిల్లర మాటలు, బజారు మాటలు మాట్లాడడం ఆయనకు అలవాటుగా మారింది.

ప్రతిసారి మరింత దిగజారి మాట్లాడుతున్నారు. బాధ్యత కలిగిన కేంద్ర మంత్రిగా పనిచేయడం అంటే ఢిల్లీ బాసుల చెప్పులు మూసినంత ఈజీ కాదని బండి సంజయ్ ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిది. కేవలం తనకు రాజకీయ ప్రాధాన్యత దక్కకపోవడంతోనే, వార్తల్లో నిలవాలని తనకు అలవాటైన చౌకబారు వీధి నాటకాలకు తెరలేపిండు'అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం.. 'అత్యవసరమైతేనే బయటకు రండి'





ఈ కబురు, హైదరాబాద్: నగరంలో పలు చోట్ల వర్షం మొదలైంది. దీంతో జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు అధికారులు సూచించారు. సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ సిరిసిల్ల, భూపాలపల్లి, రంగారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.కాగా, నగరంలో నిన్న (గురువారం) రాత్రి కుండపోత వర్షం భీభత్సం సృష్టించింది. ప్రధాన రోడ్లన్నీ చెరువులను తలపించాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడి జనజీవనం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీలు నీటమునిగి ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరింది. ఓపెన్ నాలాలు, డ్రైనేజీల మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. చాలాచోట్ల పార్క్ చేసిన కార్లు నీట మునగగా, ద్విచక్ర వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. వాహనదారులతోపాటు పాదచారులు సైతం నరక యాతన పడ్డారు.సుమారు 43 ఫీడర్ల (11 కేవీ) పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం అలముకుంది. నగరం మొత్తం సుమారు గంటన్నర పాటు వర్షం దంచి కొట్టింది. గురువారం రాత్రి 11 గంటల వరకు అత్యధికంగా గచ్చిబౌలిలో 13.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సరూర్‌నగర్, శ్రీనగర్ కాలనీల్లో 12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గంట వ్యవధిలోనే 7 నుంచి 9 సెంటీమీటర్ల వర్షం పడింది. నగర శివారులోని పలు అపార్ట్‌మెంట్లలోకి భారీగా వరద నీరు చేరటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడ్డారు.

# తమిళనాడు నూతన విద్యావిధానంలో హిందీకి చోటులేదు

చెన్నై,ఈ కబురు: హిందీపై జాతీయస్థాయిలో చర్చ జరుగుతున్న వేళ జాతీయ విద్యా విధానానికి (ఎన్‌ఈపీ)కి కౌంటర్‌గా తమిళనాడు ప్రత్యేకంగా రాష్ట్ర విద్యావిధానం2025ను తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం దీనిని ఆవిష్కరించారు. జాతీయ నూతన విద్యా విధానంలోని త్రిభాషా సూత్రం సహా పలు అంశాలపై తమిళనాడు ప్రభుత్వం తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా రాష్ట్ర విద్యా విధానాన్ని రూపొందించనున్నట్లు గతంలో ఎం.కె.స్టాలిన్ ప్రకటించారు. ఇందుకోసం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మురుగేశన్ నేతృత్వంలో 14 మంది సభ్యులతో కూడిన కమిటీని 2022లో ఏర్పాటు చేశారు. ఈ కమిటీ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి రాష్ట్ర విద్యావిధానాన్ని రూపొందించి 2024 జులై 1న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నేపథ్యంలో చెన్నైలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 'తమిళ్‌నాడు మానిల కల్వి కొళ్గై2025పళ్లి కల్వి' (తమిళనాడు రాష్ట్ర విద్యా విధానం2025పాఠశాల విద్య)ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అందులోని కీలక అంశాలు..

తమిళనాడులో తమిళం, ఆంగ్లం అనే ద్విభాషా విధానమే అనుసరించాలి.

10, 12వ తరగతి విద్యార్థులకు మాత్రమే పబ్లిక్ పరీక్షలు.

ఈ విద్యా సంవత్సరం నుంచే 11వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రద్దు.

ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించవచ్చు.

కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విద్యాబోధన అందించాలి.



# సీబీఐ విచారణ జరిపించాలి

**సీబీఐ నేరుగా విచారించే పక్షంలో కేసీఆర్, కేటీఆర్‌లను ఎప్పుడో జైల్లో వేసేవాళ్లమన్న కేంద్రమంత్రి**

ఈ కబురు, హైదరాబాద్: బీఆర్ ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహా రంపై సీబీఐతోవిచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జరిపే విచారణపై తమకు నమ్మకం లేదని అన్నారు. సిట్ విచారణ పేరుతో డ్రామాలు ఆపాలని వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ కోరుతూ లేఖ రాస్తే విచారణకు ఆదేశించేందుకు కేంద్రం సిద్ధం ఉందన్నారు. సీబీఐ నేరుగా విచారణ చేసే అధికారముంటే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లను ఎప్పుడో జైల్లో వేసేవాళ్లమని అన్నారు.ట్యాపింగ్‌లో భాగంగా కాంట్రాక్టర్లు, ఇతర వర్గాల వారిని బెదిరించి వేలకోట్ల వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చినందున దీని దర్యాప్తును ఈడీకి కూడా అప్పగించాలన్నారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని, అందుకే కేసీఆర్ కుటుంబానికి రేవంత్ క్లీన్‌చిట్ ఇచ్చారన్నారు. ట్యాపింగ్ కేసులో బాధితుడు, ప్రస్తుతం సీఎంగా ఉన్న రేవంత్ కూడా విచారణకు హాజరై స్టేట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం దిల్‌కుశ గెస్ట్‌హౌస్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

**అలాంటప్పుడు విచారణ ఎందుకు?**

గతంలో బీఆర్‌ఎస్ దోచుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది. ఫోన్ ట్యాపింగ్ అడ్డుపెట్టుకుని కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు దోచుకుంటే..ఆ సొమ్ములో వాటా కోసం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు కన్పిస్తోంది. ఆ సొమ్మును ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టాలనుకుంటున్నారేమో..అందుకే కేసీఆర్ తానా అంటే రేవంత్‌రెడ్డి తందానా అంటున్నాడు. ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్‌కు రేవంత్ క్లీన్ చిట్ ఇస్తున్నడు. ఆయనను అరెస్ట్ చేయబోమని చెబుతున్నడు. సీఎం ఎవరు ఆ మాట చెప్పడానికి? అట్లాంటప్పుడు ఈ కమిషన్లు, ఈ విచారణలు ఎందుకు?..' అని సంజయ్ నిలదీశారు.

**కేసీఆర్, కేటీఆర్‌లను విచారణకు పిలుస్తారా?**

'అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసును విచారించిన జడ్జి ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్, కేటీఆర్‌లను సిట్ విచారణకు పిలవగలదా? కేసీఆర్, కేటీఆర్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ మినహా ఎమ్మెల్సీ కవిత, ఆమె భర్త అనిల్, అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఇతర మంత్రులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతల ఫోన్లు, మావోయిస్ట్‌ల నుంచి ప్రమాదం పేరుతో నా ఫోన్‌తో పాటు అప్పట్లో టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. మొత్తం 6,500 మంది ఫోన్లను కేసీఆర్ ప్రభుత్వం ట్యాప్ చేసింది. తన కుటుంబసభ్యులు, వ్యక్తిగత సహాయకులు, పని మనుషుల ఫోన్లు, భార్యాభర్తల ఫోన్లు కూడా ట్యాప్ చేసి విన్నారు..' అని కేంద్రమంత్రి ఆరోపించారు.

**ఎస్ఐబీని అడ్డుపెట్టుకుని ట్యాపింగ్‌కు పాల్పడ్డారు..**

'ఎస్ఐబీని అడ్డం పెట్టుకుని కేసీఆర్, కేటీఆర్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. రాజకీయ నాయకులతో పాటు వ్యాపారులు, సినిమావాళ్లు, ప్రొఫెసర్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. కాంట్రాక్టర్లను, లీడర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఎస్ఐబీ అధికారులు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావు క్షణక్షణం బాధపడేలా శిక్షవేయాలి. కానీ రేవంత్ ప్రభుత్వం వీరిని కాపాడే ప్రయత్నం చేస్తోంది. కాంట్రాక్టర్లు, ఇతర వర్గాల వారిని బెదిరించి వేలకోట్ల వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చినందున దీని దర్యాప్తును ఈడీకి అప్పగించాలి. రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తే వెంటనే ఈడీ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.డబ్బులు ఎవరు తిన్నారో తేల్చాలి..

ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దగ్గర రూ.7 కోట్లు పట్టుకున్నారు. మరికొందరు కాంగ్రెస్ వాళ్ల దగ్గర కోట్ల రూపాయలు పట్టుకున్నారు. ఆ పైసలన్నీ ఎటు పోయినయ్? ట్యాపింగ్ గ్యాంగ్ తిన్నారా? ట్విట్టర్ టిల్లు తిన్నాడా? తేల్చాలి..' అని సంజయ్ అన్నారు. అన్ని ఆధారాలు ఉన్నా కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిని కూడా ఇంతవరకు అరెస్టు చేయలేదని దుయ్యబట్టారుసిట్ విచారణ సందర్భంగా ట్యాపింగ్‌నకు సంబంధించి తన వద్ద ఉన్న సమాచారం, ఆధారాలు అందజేసినట్లు తెలిపారు. కాగా శుక్రవారం సంజయ్‌తో పాటు ఆయన పీఆర్‌వో పసునూరి మధు, వ్యక్తిగత సహాయకులు బోయినపల్లి ప్రవీణ్‌కుమార్, పోగుల తిరుపతి స్టేట్‌మెంట్లు కూడా పోలీసులు రికార్డ్ చేశారు. కాగా సిట్ విచారణకు వెళ్లే ముందు బంజారాహిల్స్‌లోని తన నివాసం వద్ద కూడా ఆయన మీడియాతో మాట్లాడారు.

# తయారీ రంగంలో దేశానికి దిక్సూచిగా తెలంగాణ




పటాన్‌చెరు రూరల్, ఈ కబురు: రాష్ట్రంలో భారీ పెట్టుబడులే లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానాన్ని అమలుచేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని తోషిబా పరిశ్రమలో కొత్త సీఆర్‌జీవో కోర్ ప్రాసెసింగ్ సెంటర్, సర్జ్ అరెస్టర్ లైన్‌ను కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈహెచ్‌వీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ విస్తరణకు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తక్కువ కాలంలోనే తెలంగాణ తయారీ రంగంలో దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. 202425లో రాష్ట్రం నుంచి పారిశ్రామిక ఉత్పత్తుల విలువ రూ.2.77 లక్షల కోట్లు కాగా ఇందులో 48 శాతం తయారీ రంగానిదేనని చెప్పారు. 9 నెలల్లోనే రూ.లక్ష కోట్ల విలువైన ఎగుమతులు జరిగినట్లు తెలిపారు. జీఎస్‌డీపీ వృద్ధిరేటు 8.2% కాగా ఇది జాతీయ సగటు కంటే ఎక్కువని పేర్కొన్నారు. క్లీన్ ఎనర్జీలో రూ.29 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని తెలిపారు. 2030 నాటికి నూతన పునరుద్ధరణీయ ఇంధన సామర్థ్యాన్ని 20 వేల మెగావాట్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన సందర్భంగా తోషిబా పరిశ్రమతో రూ.562 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులోభాగంగానే కొత్త ప్లాంటును ప్రారంభించినట్లు వివరించారు. ఇలాంటి పెట్టుబడులతో తెలంగాణ విశ్వవ్యాప్తంగా ఖ్యాతి సాధిస్తుందన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించడం, కార్మికుల జీవితాల్లో వెలుగులు పంచడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. తోషిబాలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కార్మికులకు పనిభారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీశాఖ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్; జపాన్ ఎంబసీ ఎకానమిక్, డెవలప్‌మెంట్ మంత్రి క్యోకో హోకుగో, తోషిబా సీఎండీ ఫ్యురుటా, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ హిరోషీ కనేటా, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 2 కోట్ల దీపం సిలిండర్లు డోర్ డెలివరీ



**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న దీపం-2 పథకం కింద ఇప్పటి వరకు 2 కోట్ల గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు డోర్ డెలివరీ చేసినట్లు ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్..**

**అధికారులు అనవసర ఒత్తిళ్లు తేవద్దన్న ఎల్పీజీ పంపిణీదారులు**

అమరావతి,ఈ కబురు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'దీపం2' పథకం కింద ఇప్పటి వరకు 2 కోట్ల గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు డోర్ డెలివరీ చేసినట్లు ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విజయవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1200 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లంతా ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తామని ప్రకటించారు. గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీ విషయంలో ఎదురవుతున్న సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ తమ అసోసియేషన్ ముఖ్యనాయకులతో ప్రత్యేకంగా చర్చించారని, ఈ సందర్భంగా తమ సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని శ్రీనాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా వినియోగదారుల అభిప్రాయాలను సేకరించడం, ఆ నివేదికల ఆధారంగా అన్ని జిల్లాల్లో అధికారులు ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లపై ఒత్తిడి తెస్తుండటంతో మా వర్క్‌ఫోర్స్‌పై ప్రతికూల ప్రభావం పడుతోంది. జిల్లాల్లో అధికారుల ఒత్తిళ్లు ఇలాగే కొనసాగితే గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీ విధానం ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. అప్పుడు వినియోగదారులే స్వయంగా గోడౌన్‌ల వద్దకు లేదా డెలివరీ ఆటోల వద్దకు వచ్చి సిలిండర్లను తీసుకువెళ్లాల్సి రావచ్చు. ప్రభుత్వం దయచేసి ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలి' అని కోరారు. తమ సమస్యల పట్ల కమిషనర్ సానుకూలంగా స్పందించారని శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

# మోదీ దెబ్బ.. ఇది ట్రంప్ రాయబారమా?

అమెరికా విషయంలో ఏదైతే అది అయ్యిందనే నిర్ణయానికొచ్చింది భారత్. ఇప్పటిరకూ అమెరికాతో సంబంధాలపై ఆచితూచి అడుగులేసిన భారత్.. ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి రష్యాతో వాణిజ్య ఒప్పందానికే ఓకే చెప్పింది. గత కొంతకాలంగా ట్రంప్ విధించే సుంకాలపై సహనంగా ఉన్న భారత్.. అమెరికా ఆయుధాల కొనుగోలుకు తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. 'రోజూ భయపడుతూ కూర్చుంటే ట్రంప్ ఏదొక నిర్ణయంతో ఇరకాటంలో పెడుతూనే ఉంటారని నిర్ణయానికి ముగింపు పలకాలనే ఉద్దేశంతో భారత్.. ఎట్టకేలకు స్పందించింది. ఎంత సుంకాన్ని అయినా భరిస్తామని, అయితే రష్యాతో వాణిజ్య ఒప్పందం విషయంలో రాజీ పడేది లేదనే సంకేతాలు పంపింది. ఇప్పటివరకూ అమెరికాను మిత్రదేశంగా భావించిన భారత్.. ఉపయోగం లేని మిత్రత్వం అవసరం లేదనే విషయాన్ని యూఎస్‌కు అర్థమయ్యేలా చెప్పేసింది. తర్వాత పరిస్థితులు ఎలా ఉన్నా. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు తాము లొంగమనే విషయాన్ని తేటతెల్లం చేసింది.

**నెతాన్యాహూ భారత్ పర్యటన..?**

అమెరికాభారత్‌ల మిత్రత్వం దాదాపు చెడిందనే సంకేతాల నడుమ ఇజ్రాయిల్ రంగంలోకి దిగింది. ఇజ్రాయిల్ ప్రధాని నెతాన్యాహూ భారత్ పర్యటనకు రాబోతున్నట్లు తెలుస్తోంది. భారత పర్యటనలో నెతాన్యాహూ మోదీని కలిసి ఓ సలహా ఇవ్వనున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరి ఆ సలహా ఏమిటనేది పక్కన పెడితే.. డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడైన నెతాన్యాహూ భారత్‌కు ఎందుకు రానున్నారనే చర్చ నడుస్తోంది. ఇది అమెరికా ఆడుతున్న డ్రామాగా ఉందని మరొక వాదన వినిపిస్తోంది. అమెరికాతో వాణిజ్య సంబంధాలను తాత్కాలికంగా పక్కన పెట్టిన భారత్‌ను ఒప్పించేందుకు నెతాన్యాహూను ట్రంప్ రాయబారిగా పంపడానికి సిద్ధమయ్యారనే వాదన తెరపైకి వచ్చింది. ప్రత్యేకంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేసి మోదీ మాట్లాడటం, అమెరికా ఆయుధాలను, వైమానిక క్షిపణులకు కొనుగోలుపై భారత్ విముఖత వ్యక్తం చేసిన తరుణంలో నెతాన్యాహూ ఆ దిశగానే మోదీతో మాట్లాడేందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా అనేది భారత్‌కు అతి పెద్ద మార్కెట్ అనే అంశం అందరికి తెలిసిందే. ఆటువంటి తరుణంలో కూడా భారత్.. అమెరికాతో రాజీ పడేందుకు సిద్ధంగా లేకపోవడంతో నెతాన్యాహూను ట్రంప్ రంగంలోకి దింపే ఆలోచన కూడా చేసి ఉండొచ్చు. ్రంప్ అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకుంటారనే విమర్శ కూడా ఆయనపై ఉంది. అగ్రరాజ్యం అమెరికా అనేది మినహాయిస్తే ఇక్కడ ట్రంప్ గొప్పతనం ఏమీ లేదు. తాము చెప్పినట్లు 'ఆడాలని' ట్రంప్ అనుకుంటూ ఉంటారని, అది అన్ని దేశాలతో కుదరదనే విషయం భారత్ చెప్పకనే చెప్పేసింది.. ఇప్పుడు భారత్, రష్యా, చైనాల మైత్రితో అమెరికాకు గుండెల్లో రాయి పడినట్లే ఉంది.మూడు అగ్రదేశాలు ఏకం అవుతున్న తరుణంలో డొనాల్డ్ ట్రంప్‌ను కాస్త ఇరకాటంలో పడేసినట్లే ఉంది. ఎప్పుడూ భారత్‌కు వ్యతిరేకంగా ఉండే చైనా కూడా, ఇప్పుడు ట్రంప్ బెదిరింపులను తట్టుకోలేకపోతోంది. మన మంచిని కోరలేని శత్రువుకు అంగుళం చోటిస్తే మొత్తం ఆక్రమిస్తారంటూ ట్రంప్ వైఖరిని తీవ్రంగా తప్పుపట్టింది. ఈ అన్ని అంశాలను బేరీజు మేకున్న ట్రంప్.. నెతాన్యాహూను అనధికార రాయబారిగా పంపుతున్నారా? అనేది ఇప్పుడు చర్చకు దారి తీసింది. ఒకవేళ నెతాన్యాహూ భారత్ పర్యటనకు వస్తే మాత్రం, కచ్చితంగా అమెరికాతో భారత్ సంబంధాలపై మాట్లాడి రాజీ కుదిర్చే అవకాశాల్ని కూడా కొట్టిపారేయలేం. ఇంకా భారత్అమరికాల బంధం చాలా బలంగా ఉందని స్వయంగా నెతాన్యాహూ చెప్పిన తరుణంలో.. ఆ దిశగానే పావులు కదిపే అవకాశం ఉంది.

# డబుల్ టారిఫ్ దెబ్బకు భారత దిగుమతులు నిలిపేసిన అమెరికా రిటైల్ దిగ్గజాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత దిగుమతులపై డబుల్ టారిఫ్ విధిస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆ దేశ వ్యాపారుల్లో కొత్త ఆందోళన మొదలైంది. ముఖ్యంగా అదనపు సుంకం భారం ఎగుమతిదారులపైనా లేక అమెరికాలో దిగుమతి చేసుకునే కంపెనీలపైనా అనే విషయంలో సందిగ్ధం నెలకొంది. ఫలితంగా దీనిపై స్పష్టత వచ్చే వరకు వాల్‌మార్ట్, అమెజాన్, టార్గెట్, గ్యాప్ వంటి అనేక ప్రధాన అమెరికన్ రిటైలర్ దిగ్గజాలు భారత ఆర్డర్లను నిలిపేసినట్టు సమాచారం. ప్రస్తుతానికి మనదేశం నుంచి ఎలాంటి స్టాక్ దిగుమతులనైనా సరే వద్దని చెప్పినట్టు ఎన్డీటీవీ ప్రాఫిట్ తన కథనంలో పేర్కొంది. ముఖ్యంగా తదుపరి నోటీసులు ఇచ్చేవరకు టెక్స్‌టైల్స్, ఫ్యాషన్ ఉత్పత్తులను నిలిపివేయాలని కోరుతూ భారతీయ ఎగుమతిదారులకు అమెరికా కంపెనీలు ఈమెయిల్స్ పంపాయి. అమెరికాలో ఈ ఉత్పత్తులను కొనేవారు పెరిగిన ఖర్చుల భారాన్ని భరించేందుకు సిద్ధంగా లేరు. బదులుగా ఆ మొత్తం ఆర్థిక భారాన్ని భరించాలని భారతీయ ఎగుమతిదారులపైనే ఒత్తిడి తెస్తున్నాయి.

కొత్త టారిఫ్ కారణంగా ఖర్చులు 30 నుంచి 35 శాతం పెరుగుతాయని అంచనా. దీని ఫలితంగా అమెరికాకు వెళ్లే ఆర్డర్‌లు 40 నుంచి 50 శాతం తగ్గుతాయి. దీని వల్ల 45 బిలియన్ డాలర్ల (మన కరెన్సీలో రూ. 35,00044,000 కోట్ల) నష్టాలు సంభవించవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. వెల్‌స్పన్ లివింగ్, గోకల్‌డాస్ ఎక్స్‌పోర్ట్స్, ఇండో కౌంట్, ట్రైడెంట్ వంటి ప్రధాన ఎగుమతిదారులు తమ అమ్మకాలలో 4070 శాతం అమెరికా మార్కెట్‌కు పంపిస్తున్నాయి. టారిఫ్ కారణంగా ఇప్పుడు బంగ్లాదేశ్, వియత్నాం వంటి పోటీ దేశాలు ఆ మేరకు మార్కెట్‌ను సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

# నాకు బోర్డు మద్దతు ఉంది.. రాజీనామా డిమాండ్లపై ఇంటెల్ సీఈవో

తనకు కంపెనీ బోర్డు సభ్యుల మద్దతు సంపూర్ణంగా ఉందని చిప్ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ సీఈవో లిప్ బు టాన్ స్పష్టంచేశారు. తనపై తప్పుడు ప్రచారానికి సంబంధించి వివరణ ఇచ్చేందుకు శ్వేతసౌధాన్ని సంప్రదించినట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక, జాతీయభద్రతను మరింత మెరుగుపర్చేలా ఉన్న అధ్యక్షుడి లక్ష్యాలను పంచుకొంటానన్నారు. ఆయన లేవనెత్తిన అంశాలపై వాస్తవాలను ఆయన కార్యవర్గానికి వెల్లడించానన్నారు. గతంలో తాను పనిచేసిన వాల్డన్ ఇంటర్నేషనల్, కాడెన్స్ డిజైన్ సిస్టమ్స్ గురించి చాలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేశారన్నారు. ఎల్లప్పుడూ తాను అత్యున్నతస్థాయి న్యాయ, నైతిక విలువలను పాటిస్తానని చెప్పారు. ఆయన ఉద్యోగులకు రాసిన లేఖలో ఈ అంశాలను పేర్కొన్నారు. ఈ లేఖ కంపెనీ అంతర్గత వెబ్‌సైట్‌లో పబ్లిష్ చేశారు.

"ప్రస్తుత కీలక పరిస్థితుల్లో ఇంటెల్ కార్పొరేషన్‌కు నాయకత్వం వహించడం కేవలం ఉద్యోగమే కాదు. అదొక గౌరవం. నా పేరు ప్రతిష్ఠలు కేవలం విశ్వాసంతోనే సంపాదించుకొన్నాను. నేను ఏం చెబుతానో అదే సరైన మార్గంలో చేస్తాను. అదేవిధంగా నేను ఇంటెల్‌ను కూడా నడిపిస్తున్నాను" అని పేర్కొన్నారు.

మలేసియాలో పుట్టి పెరిగిన లిప్ బు టాన్ అత్యంత వివాదాస్పదమైన వ్యక్తి.. రాజీనామా చేయాలని అంటూ అమెరికా అధ్యక్షుడు తన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు పెట్టడంతో అగ్గిరాజుకొంది.

నేరుగా ఓ పబ్లిక్ కంపెనీ సీఈవో రాజీనామా చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు కోరడం అత్యంత అరుదు. ఒకప్పటి చిప్ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ మార్కెట్‌లో పోటీ తట్టుకోలేక మనుగడ కోసం పోరాడుతుండగా.. ట్రంప్ తమ సీఈవోపై కొత్త వివాదం సృష్టించడం దానికి తలనొప్పిగా మారింది.





మరోవైపు చైనా సంస్థలకు, లిప్ బు టాన్‌కు మధ్య ఉన్న సంబంధాలు, అతడు గతంలో పనిచేసిన 'కాడెన్స్ డిజైన్'పై ఇటీవల నమోదైన క్రిమినల్ కేసులో ప్రమేయానికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ.. ఇంటెల్ సంస్థ బోర్డు ఛైర్మన్‌కు అమెరికా రిపబ్లికన్ పార్టీ సెనేటర్ టామ్ కాటన్ లేఖ రాసినట్లు కొన్నాళ్ల క్రితం రాయిటర్స్ పేర్కొంది. ఈనేపథ్యంలోనే ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లో రాయిటర్స్ కథనం ప్రకారం.. టాన్ తాను స్వయంగా స్థాపించి నిర్వహిస్తున్న వెంచర్ ఫండ్ల ద్వారా వందలాది చైనా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు ఆరోపించింది. వాటిలో కొన్ని చైనా మిలిటరీకి చెందిన సంస్థలు కూడా ఉన్నాయని పేర్కొంది.

# సోమవారం లోక్ సభలో కొత్త ఐటీ బిల్లు.. వారికి భారీగా ప్రయోజనాలు?






ఇన్ కమ్ ట్యాక్స్ బిల్లు 2025 విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఐటీ బిల్లు 1961 ను ఉపసంహరించుకుంది. దీని స్థానంలో సవరణలతో కూడిన కొత్త ఐటీ యాక్ట్ ను తీసుకురాబోతున్నది. ఈ మేరకు కొత్త బిల్లును వచ్చే సోమవారం లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్నది. మారిన పరిస్థితులకు అనుగణంగా కొత్త ఆదాయపు పన్ను చట్టం తీసుకువచ్చేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఆరు దశాబ్దాలుగా దేశంలో అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం1961 స్థానంలో నూతన బిల్లు 2025ను ఈ ఏడాది ఫిబ్రవరిలో లోక్ సభలో ప్రవేశపెట్టింది. అయితే దీనిపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ బిల్లు పరిశీలనకు బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా అధ్యక్షతన సెలెక్ట్ కమిటీకి పంపింది. దీనిపై అధ్యయనం చేసిన ఈ కమిటీ గత జులై 21న తుది నివేదికను పార్లమెంట్ కు సమర్పించింది. మొత్తం 4500 పేజీలతో కూడిన ఈ నివేదికలో ముసాయిదా బిల్లుకు 285 ప్రతిపాదనలు సూచించింది. అయితే ఈ ప్రతిపాదనలకు అనుగుణంగా తుది మెరుగులు దిద్దిన కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 11న లోక్ సభ ముందుకు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది.

**సులభతరంగా కొత్త యాక్ట్:**

1961 ఐటీ చట్టం ఇప్పటి వరకు 4,000 కంటే ఎక్కువ సవరణలకు గురైంది. అలాగే 5 లక్షలకు పైగా పదాలతో కలిగి ఉన్న ఈ చట్టం అర్థం చేసుకోవడంలో చాలా కష్టతరంగా మారింది. దీంతో పాత చట్టం స్థానంలో కొత్త బిల్లును దాదాపు 50 శాతం సులభతరం చేసేలా రూపొందిచేలా కసరత్తు చేసింది. సాధారణ పన్ను చెల్లింపుదారులు చదవడం, అర్థం చేసుకోవడం ఈజీ అయ్యేలా కొత్త చట్టం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పన్ను చెల్లింపుదారులందరికీ ప్రయోజనం చేకూర్చేలా స్లాబ్‌ల రేట్లను అన్ని విధాలుగా మార్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇంటిపై ఆదాయం పొందుతున్న వారికి కొత్త చట్టం భారీ ఉపశమనం కలిగేలా ప్రతిపాదనలు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గృహ రుణ వడ్డీతో పన్ను మినహాయింపు ప్రయోజనాలు కేవలం సొంతింట్లో ఉంటున్నవారికి మాత్రమే వర్తిస్తుండగా ఇకపై సొంతింటిని అద్దెకు ఇచ్చిన సందర్భాల్లోనూ వడ్డీతో పన్ను మినహాయింపు కల్పించాలని కొత్త చట్టంలో సిఫార్సులు ఉన్నట్లు తెలుస్తోంది.





# తగ్గనున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఈఎంఐలు

దేశీయ అతిపెద్ద ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన కస్టమర్లకు భారీ ఊరట కల్పించింది. బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. సవరించిన రేట్లు ఆగస్టు 7 నుంచే అమల్లోకి వచ్చాయని వెల్లడించింది. బ్యాంకు నిర్ణయంతో వినియోగదారులు తీసుకునే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐల భారం తగ్గనుంది. ఎంపిక చేసిన రుణాల కాలవ్యవధులపై బ్యాంకు ఎంసీఎల్‌ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. రిటైల్ రుణాలపై ప్రభావం చూపే ఏడాది కాలపరిమితి కలిగిన ఎంసీఎల్‌ఆర్ మాత్రం 30 బేసిస్ పాయింట్లు తగ్గించింది. బ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, సవరించిన తర్వాత రుణాల రేట్లు 8.55 శాతం నుంచి 8.75 శాతం మధ్య ఉంది. ఇదివరకు 8.60 శాతం నుంచి 8.80 శాతం మధ్య ఉండేది. కొత్త రేట్లకు సంబంధించి.. ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8.55 శాతానికి, 3 నెలల ఎంసీఎల్‌ఆర్ 8.60 శాతానికి, 6 నెలల ఎంసీఎల్‌ఆర్ 8.70 శాతానికి, ఏడాది ఎంసీఎల్‌ఆర్ 9.05 శాతం నుంచి 8.75 శాతానికి తగ్గించింది. 2 ఏళ్ల ఎంసీఎల్‌ఆర్ 8.75 శాతం స్థిరంగా ఉంచింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 8.75 శాతానికి తగ్గించింది.



# పుంజుకున్న స్టాక్ మార్కెట్లు

**మరణించినవారి బ్యాంకు ఖాతాలు, సేఫ్ లాకర్ల క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియను సులభతరం చేసే ప్రతిపాదనలతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా ముసాయిదా సర్క్యులర్ జారీ చేసింది. ప్రతిపాదిత మార్గదర్శకాలు డిపాజిట్ ఖాతాలు, సేఫ్ లాకర్లు నిర్వహించే అన్ని వాణిజ్య, సహకార బ్యాంకులకు వర్తిస్తాయి.**

ముసాయిదా సర్క్యులర్ పై ఆగస్టు 27లోగా అభిప్రాయాలు తెలపాలని సెంట్రల్ బ్యాంక్ కోరింది. వీలునామా, కోర్టు ఉత్తర్వులు లేదా వివాదం లేకపోతే వారసత్వ ధృవీకరణ పత్రాలు లేదా ప్రొబేట్ వంటి చట్టపరమైన పత్రాలపై పట్టుబట్టకుండా నామినీలు లేదా జీవించి ఉన్న ఖాతాదారులకు బ్యాంకులు నిధులను విడుదల చేయాలని సర్క్యులర్లో పేర్కొంది. క్లెయిమ్‌దారులు నామినీ క్లెయిమ్ ఫారం, మరణ ధృవీకరణ పత్రం, చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాన్ని సమర్పిస్తే చాలు.

**ఆలస్యమైతే పరిహారం**

ఏదైనా డిపాజిట్ సంబంధిత క్లెయిమ్ గడువులోగా పరిష్కరించబడకపోతే, అటువంటి ఆలస్యానికి గల కారణాలను బ్యాంకు హక్కుదారులకు తెలియజేయాలి. "... ఆలస్యమైతే, ఆ ఆలస్య కాలానికి సెటిల్మెంట్ మొత్తంపై ప్రస్తుత బ్యాంకు రేటు సంవత్సరానికి 4% కంటే తక్కువ కాకుండా వడ్డీ రూపంలో క్లెయిమ్‌దారులకు బ్యాంకు పరిహారం చెల్లిస్తుంది" అని సర్క్యులర్లో పేర్కొన్నారు. ఇక సేఫ్ డిపాజిట్ లాకర్ లేదా సేఫ్ కస్టడీలో ఉన్న వస్తువులకు సంబంధించి క్లెయిమ్లను ప్రాసెస్ చేయడంలో జాప్యం జరిగితే, ఆలస్యం జరిగిన ప్రతి రోజుకు బ్యాంకు రూ .5,000 చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

**నాన్-నామినీ, జాయింట్ అకౌంట్ క్లెయిమ్‌ల సెటిల్మెంట్**

మరణించిన డిపాజిటర్ నామినీని పేర్కొనకపోయి ఉన్నప్పుడు లేదా జాయింట్ అకౌంట్ల విషయంలో నామినీ లేదా సర్వైవర్ క్లాజ్ లేని సందర్భాల్లో క్లెయిమ్‌ల పరిష్కారానికి బ్యాంకులు సరళీకృత విధానాన్ని అవలంబించాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. ఇటువంటి క్లెయిమ్‌ల సెటిల్మెంట్ కోసం ఒక బ్యాంకు దాని రిస్క్ మేనేజ్మెంట్ వ్యవస్థల ఆధారంగా రూ .15 లక్షల పరిమితిని నిర్ణయించాలి.

బ్యాంకులు పూర్తి డాక్యుమెంట్లు అందిన 15 రోజుల్లోగా క్లెయిమ్లను సెటిల్ చేయాల్సి ఉంటుంది. సేఫ్ డిపాజిట్ లాకర్/వస్తువులు సేఫ్ కస్టడీలో ఉన్నట్లయితే, అవసరమైన అన్ని పత్రాలను అందుకున్న 15 రోజుల్లోగా, బ్యాంకు క్లెయిమ్ ప్రాసెస్ చేయాలి.



## రష్యా చమురుపై ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు రాలేదు: హెచ్‌పీసీఎల్

రష్యా నుంచి చమురు కొంటున్నదనే కారణంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌ను 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ చమురు శుద్ధి సంస్థ హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) ఛైర్మన్, ఎండీ వికాస్ కౌశల్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత ప్రభుత్వం రష్యా చమురు కొనుగోలును నిలిపివేయాలని లేదా కొనసాగించాలనే ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, బదులుగా పరిస్థితులను బట్టి చమురు దిగుమతులపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే అవకాశం తమకుందని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీసీఎల్ రష్యా చమురును ప్రాసెస్ చేసే ప్రక్రియను తగ్గించింది. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలలో ప్రాసెస్ చేసిన మొత్తం ముడి చమురులో రష్యా ముడిచమురు కేవలం 13.2 శాతం మాత్రమే. ఇందుకు భౌగోళిక రాజకీయ పరిస్థితులే కారణం. ఈ విషయంలో ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. భవిష్యత్తులో మరే కారణంగానైనా రష్యా ముడిచమురు కొనవద్దని ఆదేశాలిస్తే, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించే వీలుంటుందని ఆయన వివరించారు. రష్యా చమురును కొనడం లేదని చెప్పట్లేదు. రష్యా ముడిచమురు ప్రాసెస్ చేయకపోవడం వల్ల ఎంతమేర నష్టం ఉంటుందనే అంశాలను పరిశీలించాం. ఆర్థికంగా ఎక్కడ తక్కువకు లభిస్తే అక్కడి నుంచి ముడిచమురు కొనుగోలు చేస్తాం. రష్యా చమురు కొనకపోవడం వల్ల పెద్ద ప్రభావం ఉండదని వికాస్ వెల్లడించారు.

# సంచలన ప్రకటన చేసిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఆదేశాలు





సినీ కార్మికులు వేతనాలు పెంచాలని సమ్మే నిర్వహించిన విషయం తెలిసిందే. నిర్మాతలు వేతనాలు 30 శాతం పెంచి ఇవ్వాలని అలా అయితేనే సమ్మే విరమించుకుంటామని పట్టుబట్టుకుని కూర్చున్నారు. ఈ పంచాయితీ ఇంకా ఏ కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో.. తాజాగా, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సంచలన నిర్ణయం తీసుకుంది. నిర్మాతలకు ఆదేశాలు జారీ చెస్తూ హెచ్చరిక చేసింది. ''స్టూడియోలు, ఓట్ డోర్ యూనిట్లు, మౌలిక వసతుల యూనిట్ సభ్యులు తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నుండి మందస్తు సమాచారం, స్పష్టమైన అనుమతి లేకుండా ఎలాంటి సేవలను అందించకూడదు. నిర్మాతలు ఈ ఆదేశాలు సీరియస్‌గా తీసుకోవాలి. తెలుగు సినీ పరిశ్రమలోని 24 విభాగాల యూనియన్లు ఏకపక్షంగా సమ్మెకు పిలుపునివ్వడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. చర్చలు, సంప్రదించులకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు దూరంగా ఉండాలని కోరుతున్నాము. తదుపరి సూచనలు ఇచ్చే వరకు ఈ ఆదేశాలు అమల్లోనే ఉంటాయి'' అని తెలిపారు. కాగా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయంతో దర్శక నిర్మాతలు తలలు పట్టుకున్నారు. ఎందుకంటే స్టార్ హీరోల సినిమాలన్ని షూటింగ్ దశలో ఉండగా.. ఇలాంటి సమయంలో ఈ ప్రకటన వచ్చింది. విడుదల తేదీలు ప్రకటించిన భారీ ప్రాజెక్ట్స్ తెలుగు ఫిల్మ్ ఛాంబర్స్ నిర్ణయం వల్ల షూటింగ్ వాయిదా పడటంతో పాటు విడుదల ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఇక ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియులు నిరాశ చెందుతున్నారు.

# టాలీవుడ్ రూపు రేఖలు మార్చిన సినిమా రీరిలీజ్.. ఆగష్టు 14న ట్రైలర్

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అక్కినేని నాగార్జు, రామ్ గోపాల్ వర్మకాంబినేషన్ వచ్చిన శివ సినిమాకు సపరేట్ ఫ్యాన్స్ ఉంటారు. 1990లో వచ్చిన ఈ చిత్రం.. టాలీవుడ్ రూపురేఖల్ని మార్చేసిందని స్వయంగా దర్శకులు, హీరోలే చెబుతుంటారు. ఇండస్ట్రీని శివకు ముందు.. శివ తర్వాత అని మాట్లాడుకోవడమే ఇందుకు నిదర్శనం. ఈ సినిమాలోని పాటలు, ఫైట్లు, సీన్లు అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాతో రామ్ గోపాల్ వర్మ అనే ఒక విలక్షణ దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం అయ్యాడు.

అయితే.. నాగార్జునను, శివ సినిమాను ఇష్టపడే వారికి దర్శకుడు రామ్ గోపాల్ వర్మ శుభవార్త చెప్పారు. శివ సినిమాను రీరిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టర్ విడుదల చేశారు. 4K డాల్బీ అట్మోస్‌తో రీ-రిలీజ్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించాడు. అయితే, ఈ చిత్ర రీ-రిలీజ్ ట్రైలర్‌ను సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన లేటెస్ట్ చిత్రం 'కూలీ'తో పాటు థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు అక్కినేని నాగార్జున పేర్కొన్నారు.







# వేలంకన్ని చర్చి, నాగూర్ దర్గాను సందర్శించిన శోభిత

హీరో నాగచైతన్య సతీమణి, నటి శోభిత ప్రస్తుతం తమిళనాడులో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె వేలంకన్ని చర్చి, నాగూర్ దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు.

'ఇటీవలి జీవితం' అనే హ్యాష్‌టాగ్‌తో ఉన్న చిత్రాలను ఆమె తన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. అలాగే శోభిత తన స్నేహితురాలి ఓ పెళ్లి వేడుకకు హాజరయ్యారు. తర్వాత ఆమె బీచ్‌లో సేద తీరారు. 'ఏది వచ్చినా.. దాన్ని తిరస్కరించవద్దు. అలాగే అది వెళ్లిపోయినప్పుడు బాధ పడొద్దు' అని రాసుకొచ్చారు.

ఇక సినిమాల విషయానికొస్తే.. శోభిత చివరిసారిగా దేవ్‌పటేల్ దర్శకత్వంలో వచ్చిన 'మంకీ మ్యాన్'లో చివరిసారిగా కనిపించారు. మార్చి 11, 2024న ఈ చిత్రాన్ని 'సౌత్ బై సౌత్‌వెస్ట్'లో ప్రదర్శించారు. అలాగే.. ఏప్రిల్ 5, 2024న యూనివర్సల్ పిక్చర్స్ ద్వారా యునైటెడ్ స్టేట్స్, కెనడాలో థియేటర్లలో విడుదలైంది. విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం ఇంకా మన దేశంలో మాత్రం రిలీజ్ కాలేదు. అలాగే జీ5 చిత్రం.. లవ్, సితారలో నటించారు. అయితే, తన తదుపరి ప్రాజెక్ట్ ఏంటో ఆమె ఇంకా ప్రకటించలేదు. నాగచైతన్య, శోభిత వివాహం గతేడాది డిసెంబర్‌లో జరిగిన విషయం తెలిసిందే.



# రెస్టారెంట్ మధ్యలో సడన్‌గా ఏడవమన్నాడు.. అమ్మాయిగా..

కొన్ని ఆడిషన్స్ చిత్రవిచిత్రంగా ఉంటాయి. ఎంత సిద్ధమై వచ్చినా సరే ఊహకందని పనులు చేయిస్తారు. అలా తనకు జరిగిన ఓ విచిత్ర ఆడిషన్‌ను గుర్తు చేసుకుంది బాలీవుడ్ నటి ఇషా తల్వార్ . ఓ ఆడిషన్ కోసం యష్ రాజ్ ఫిలింస్ సంస్థకు చెందిన కాస్టింగ్ డైరెక్టర్ షనూ శర్మను కలిశాను. నాకు ముంబై వెర్సోవాలో ఓ రెస్టారెంట్ లో సీన్ ఉందన్నారు. అక్కడికి వెళ్లి అందరి మధ్యలో గట్టిగా ఏడవాలని చెప్పారు.

**రెస్టారెంట్ లో ఏడవమన్నారు**

నటి ఎటువంటి సన్నివేశాలకైనా అభ్యంతరం చెప్పకూడదన్నారు. షనూ, తన అసిస్టెంట్లతో కలిసి రెస్టారెంట్ లో నా ముందే కూర్చుంది. అందరూ భోజనం చేస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. రద్దీగా ఉన్న రెస్టారెంట్ లో అందరికీ వినబడేలా గట్టిగా ఏడ్వాలని చెప్పేసరికి అంతా అయోమయంగా అనిపించింది. అలా చేసేందుకు ధైర్యం సరిపోలేదు. ఒక అమ్మాయిని ఇలా పదిమందిలో ఏడిపించడం దేనికో నాకస్సలు అర్థం కాలేదు.

**ఇదేం ఆడిషన్?**

ఆఫీస్‌లో ఆడిషన్ పెట్టుకుంటారు కానీ, ఇలా జనం మధ్యలోనా? పోనీ.. సహజంగా రావాలంటే ఏదైనా రెస్టారెంట్‌ను కాసేపటికి అద్దెకు తీసుకుని ఆడిషన్ చేయాలి!ఏదేమైనా ఇది దాదాపు పదేళ్ల కిందట జరిగిన సంఘటన. ఇండస్ట్రీకి కొత్తగా వచ్చేవాళ్ల కోసం ఈ స్టోరీ పెడుతున్నాను. ఎవరూ ఒత్తిడికి గురి కాకండి. నేనైతే అలా రెస్టారెంట్ లో ఏడవనని చెప్పేశాను, దీంతో సదరు సినిమాలో అవకాశం కూడా దక్కలేదు. కానీ, ఛాన్సుల కోసం ఇలా రెస్టారెంట్ లో అస్సలు ఏడవలేను అని చెప్పుకొచ్చింది.

**ఆ కాస్టింగ్ డైరెక్టర్ ఎవరంటే?**

ఇషా.. మీర్జాపూర్ వెబ్ సిరీస్, ఆర్టికల్ 15 చిత్రాల్లో నటించింది. కాగా ఈ సీనియర్ కాస్టింగ్ డైరెక్టర్ షనూ.. బాలీవుడ్‌కు ఎంతోమంది నటీనటులను పరిచయం చేసింది. వారిలో రణ్‌వీర్ సింగ్, భూమి పడ్నేకర్ వంటి స్టార్స్ ఉన్నారు. ఈ మధ్యే సయ్యారా మూవీతో అహాన్ పాండే, అనీత్ పడ్డాను ఇండస్ట్రీకి పరిచయం చేసింది.



# ఆ ఒక్క వ్యాయామం చేస్తూ 9కేజీలు తగ్గిన కీర్తిసురేష్. డైట్ కూడా అక్కర్లేదట

బరువు పెరగటం సులభమేమో కానీ తగ్గటం అంత ఈజీ కాదు. చాలా కష్టపడాల్సి ఉంటుంది. ముఖ్యంగా నోటికి ప్లాస్టర్ వేసుకోవాల్సిందే. చాలా మితంగా అది కూడా కేలరీలు లెక్క పెట్టుకుని తినాలి. కానీ టాలీవుడ్ హీరోయిన్ కీర్తి సురేష్ మాత్రం ఎలాంటి డైట్ పాటించకుండా సులభంగా సన్నబడిందట. ఈ విషయాన్ని కీర్తి ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 2019లో తాను ఏకంగా 9 కేజీలు తగ్గానని చెప్పారు. ఎలాంటి డైట్, బరువు తగ్గే టాబ్లెట్స్ వాడలేదని అన్నారు. ఆ సమయంలో తాను చాలా బొద్దుగా ఉన్నానని చెప్పారు. కానీ ఎలాంటి డైట్ చేయకుండా కార్డియో ఎక్కువగా చేసి బరువు తగ్గినట్టు తెలిపారు.

కార్డియో చేయడం ద్వారా కండరాలు తగ్గుతాయని, కాబట్టి స్ట్రెంత్ ట్రైనింగ్ అవసరం లేకుండానే కేవలం కార్డియో చేశానని తెలిపారు. అలా వేగంగా బరువు తగ్గినట్టు చెప్పారు. తన ముఖం బరువు తగ్గిన తరవాత చాలా చిన్నగా బొక్కల మాధిరిగా కనిపించిందన్నారు. దానికి కారణం తాను ఎక్కువగా కార్డియో చేయడమే అన్నారు. అంతకు ముందు వ్యాయామం చేయకపోవడం వల్లనే బరువు పెరిగానని అన్నారు. షూటింగ్స్‌కు వెళ్లడం, తినడం, పడుకోవడం ఇలానే ప్రతిరోజు చేయడం వల్ల బరువు పెరిగినట్టు చెప్పారు. ఇదిలా ఉంటే కార్డియో వ్యాయామం ప్రభావం చాతి, కాళ్లు, బ్యాక్ పై పడుతుంది. కార్డియో వ్యాయామం కిందికి వాకింగ్, జాగింగ్ చేయడం, సైక్లింగ్, స్విమ్మింగ్ లాంటివి వస్తాయి.

# ఈ ఇద్దరిపై 'వర్క్‌లోడ్' ఎఫెక్ట్.. మరి భారత 'పేస్' రేసులో ఇంకెవరు?

1990ల్లో జవగళ్ శ్రీనాథ్, వెంకటేశ్ ప్రసాద్.. 2000ల్లో జహీర్ ఖాన్, ఆశిశ్ నెహ్రా, అజిత్ అగార్కర్, ఆర్పీ సింగ్, ఇషాంత్ శర్మ, ఇర్ఫాన్ పఠాన్, శ్రీశాంత్.. 2010ల్లో భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమీ, ఉమేశ్ యాదవ్ భారత పేస్ సత్తా చాటారు. అప్పుడొచ్చారు ఆ ఇద్దరు. టీమ్ఇండియా విదేశాల్లో అద్భుత 'టెస్టు' విజయాలు సాధించడంలో కీలక పాత్ర వారిదే. ఇప్పుడు వారి విషయంలో 'వర్క్‌లోడ్' కీలకం కానుంది. అందుకే 'యువతరం'పై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

పేస్ బౌలర్లంటేనే గాయాల బెడద ఎక్కువ. ఒక్కసారి దురదృష్టవశాత్తూ గాయపడితే కనీసం మూడు నుంచి ఆరు నెలల వరకు ఆటకు దూరం కావాల్సిన పరిస్థితి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ వచ్చాక ఇప్పుడు సుదీర్ఘ ఫార్మాట్ ఆసక్తికరంగా మారింది. ప్రతి జట్టూ విజయం కోసం చివరివరకూ పోరాడుతున్నాయి. ఇలాంటప్పుడు కేవలం బుమ్రా, సిరాజ్ పైనే ఎక్కువ భారం మోపకుండా ఉండాలంటే 'యువకెరటాలు' టీమ్ఇండియా ఒరలో ఉండాల్సిందే. మరి ఆ రేసులో ఎవరు ఉన్నారో చూద్దాం.



**ఆకాశ్‌దీప్ అదుర్స్**

'మరో షమీ వచ్చాడు'.. ఆకాశ్‌దీప్ టెస్టుల్లోకి అడుగుపెట్టిన సందర్భంలో వినిపించిన వ్యాఖ్య. ఆకాశ్ బౌలింగ్ యాక్షన్‌తోపాటు ఆహార్యం కూడా అలాగే ఉండేది. మొదట్లో పెద్దగా ఆకట్టుకోని ఆకాశ్.. ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో మాత్రం ఈ 28 ఏళ్ల కుర్రాడు అదరగొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో ఏకంగా 10 వికెట్ల ప్రదర్శన చేశాడు. నిలకడగా బంతులేయడం అతడి బలమైతే.. ఆరంభంలో కాస్త ఎక్కువగా పరుగులు ఇస్తుంటాడు. ఆ డిఫెక్ట్‌ను సరిచేసుకుంటే సీనియర్ల తర్వాత బౌలింగ్‌కు నాయకత్వం వహించే అవకాశం లేకపోలేదు. ఆకాశ్ ఇంకా పరిమిత ఓవర్ల క్రికెట్‌లోకి అరంగేట్రం చేయకపోవడం గమనార్హం.

**దేశవాళీలో ముకేశ్ సూపర్**

ఆకాశ్‌దీప్ కంటే ముందే జాతీయజట్టులోకి ముకేశ్ కుమార్ అరంగేట్రం చేశాడు. కానీ, అతడికి వచ్చినన్ని అవకాశాలు ఈ బౌలర్‌కు రాలేదు. ఇప్పటివరకు కేవలం మూడు టెస్టులే ఆడిన ముకేశ్ ఏడు వికెట్లు తీశాడు. వన్డేల్లోనూ 6 మ్యాచుల్లో 5 వికెట్లు పడగొట్టాడు. జాతీయజట్టుకు అడపాదడపా ఆడుతున్న ముకేశ్.. దేశవాళీలో మాత్రం 200కి పైగా వికెట్లు తీసిన అనుభవం ఉంది. 31 ఏళ్లకు చేరిన ముకేశ్‌కు ఇంకా సెంట్రల్ కాంట్రాక్ట్ కూడా లేదు.

**అదే ప్రసిద్ధ్ కృష్ణ సమస్య**

ఇద్దరు స్టార్ పేసర్లు జట్టులో ఉన్నప్పుడు అవకాశం వస్తే.. దానిని రెండు చేతులతో ఒడిసిపట్టుకోవాలి. ఆ సమయంలో పెద్దగా ఒత్తిడి కూడా ఉండదు. కానీ, ప్రసిద్ధ్ కృష్ణ మాత్రం ప్రత్యర్థి బ్యాటర్లకు టార్గెట్ అవుతాడు. అతడేమన్నా వికెట్లు తీయడం లేదా? అంటే అదేం లేదు. ఇంగ్లాండ్‌తో మూడు టెస్టులు ఆడిన ప్రసిద్ధ్ 14 వికెట్లు తీయడం గమనార్హం. కానీ, భారీగా పరుగులు ఇవ్వడమే అతడి అతిపెద్ద సమస్య. ఈ సిరీస్‌లో 105 ఓవర్లు వేసిన అతడు 519 పరుగులు ఇచ్చాడు. ఈ విషయంలో ప్రసిద్ధ్ మెరుగుపడితే మాత్రం కుర్రాడికి మంచి భవిష్యత్తు ఉంటుందనేది క్రీడా పండితుల అంచనా.

**అర్ష్‌దీప్ అరంగేట్రం ఎప్పుడో?**

భారత జట్టుకు లెఫ్ట్‌ఆర్మ్ పేసర్లు చాలా తక్కువగా దొరుకుతారు. జహీర్, నెహ్రా, ఇర్ఫాన్ పఠాన్, ఆర్పీ సింగ్ మాత్రమే ఈతరం క్రికెట్ అభిమానులకు తెలిసి ఉంటుంది. టెస్టుల్లో ప్రస్తుతం ఉన్న టీమ్ఇండియాలో ఒక్క లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ లేడంటే నమ్మగలరా? తాజాగా ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకెళ్లినా.. అరంగేట్రం మాత్రం చేయించలేదు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాత్రం అర్ష్‌దీప్‌తోపాటు ఖలీల్ అహ్మద్, జయ్‌దేవ్ ఉనద్కత్, యశ్ దయాళ్ వంటి బౌలర్లు ఉన్నా.. జయ్‌దేవ్ మినహా మరెవరూ టెస్టుల మొహం కూడా చూడలేదు. భువీ, షమీ కంటే ముందు జయ్‌దేవ్ (2010లో) డెబ్యూ చేసిన అతడు ఆడిన టెస్టులు కేవలం 4 మాత్రమే కావడం గమనార్హం. ఇప్పుడు అర్ష్‌దీప్ వస్తే లెఫ్ట్ అండ్ రైట్ కాంబినేషన్ బౌలింగ్‌తో వైవిధ్యంగా ఉంటుందనేది కాదనలేని వాస్తవం. అయితే, ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు అర్ష్‌దీప్‌ను ఎంపిక చేసినప్పటికీ ఒక్క మ్యాచ్‌లోనూ ఆడించలేదు.

**హర్షిత్ - అన్షుల్ కాంబోజ్**

ఐపీఎల్‌లో అదరగొట్టిన హర్షిత్ రాణా, దేశవాళీలో ఒకే మ్యాచ్‌లో పది వికెట్లు తీసి సత్తా చాటిన అన్షుల్ కాంబోజ్ కూడా భారత పేస్ యువ కెరటాలు. హర్షిత్ గతేడాది ఆస్ట్రేలియాపై అరంగేట్రం చేయగా.. పెర్త్‌లో నాణ్యమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లోనూ ఆడిస్తారని భావించినా.. గాయం కారణంగా మొత్తం సిరీస్‌కే దూరమయ్యాడు. 140 కి.మీ. వేగంతో నిలకడగా బంతులేసే హర్షిత్‌కు ప్రసిద్ధ్‌తో తీవ్ర పోటీ తప్పదు. మరోవైపు అన్షుల్ కాంబోజ్ ఇంగ్లాండ్‌తో ఒక టెస్టు ఆడినా.. పెద్దగా ప్రభావం చూపించలేదు. అయితే, అతడికి అవకాశాలు ఇస్తూ పోతేనే మెరుగు అవుతాడు. ఈ విషయంలో మేనేజ్‌మెంట్ మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

**చివరిగా:** పైన పేర్కొన్న పేసర్లు ఇప్పుడు జాతీయ జట్టుకు ఆడేందుకు పోటీపడుతున్నారు. ఉమ్రాన్ మాలిక్, ఖలీల్ అహ్మద్, కుల్‌దీప్ సేన్, మోసిన్ ఖాన్, అవేశ్ ఖాన్, శివమ్ మావికి టెస్టు అనుభవం లేదు. అయితే, దేశవాళీలో రాణించి తమ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువ పేసర్లూ లేకపోలేదు. విద్వత్ కవేరప్ప, వైశాఖ్ విజయ్‌కుమార్, గౌరవ్ యాదవ్, హిమాన్షు చౌహాన్ సిద్ధంగా ఉన్నారు.

# ఆ నాలుగింట్లో ఒక్కటే 'వెరీ గుడ్' పిచ్!

అండర్సన్ తెందూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన ఐదు టెస్టుల సిరీస్ సమమైంది. ఇరు జట్లూ రెండేసి మ్యాచుల్లో గెలవగా.. ఒక టెస్టు డ్రాగా ముగిసింది. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఇంగ్లాండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను దక్కించుకున్నారు. ఐదు మైదానాల్లో ఐదు టెస్టులు జరిగాయి. తాజాగా పిచ్‌లకు రేటింగ్‌లను ఐసీసీ వెల్లడించింది. ఇందులో చివరి టెస్టు జరిగిన ఓవల్ మైదానం పిచ్ గురించి ఇంకా రేటింగ్ ఇవ్వలేదు.



**ఇదొక్కటే...**

భారత్ ఐదో రోజు తొలి సెషన్ వరకూ ఆధిపత్యం ప్రదర్శించిన మ్యాచ్ ఇది. లీడ్స్ వేదికగా జరిగిన టెస్టులో ఇంగ్లాండ్ 370+ పరుగులను ఛేదించి విజయం సాధించింది. ఇక్కడి పిచ్‌కు ఐసీసీ 'వెరీ గుడ్' అని రేటింగ్ ఇచ్చింది. ఔట్‌ఫీల్డ్‌కూ అదే రేటింగ్ దక్కింది.

**టీమ్ఇండియా గెలిచిన 'ఎడ్జ్‌బాస్టన్'**

రెండో టెస్టులో భారత్ అపూర్వ పోరాటంతో ఘన విజయం సాధించింది. భారీ లక్ష్యం నిర్దేశించి మరీ ఇంగ్లాండ్‌ను కట్టడి చేయడం విశేషం. సిరాజ్, ఆకాశ్‌దీప్ అద్భుతంగా బౌలింగ్ చేసి జట్టును గెలిపించారు. ఈ పిచ్‌కు ఐసీసీ 'సంతృప్తికరం' అని.. ఔట్‌ఫీల్డ్‌కు 'వెరీ గుడ్' రేటింగ్ ఇచ్చింది.

**లార్డ్స్ పిచ్‌కూ..**

చివరి వరకూ పోరాడిన టీమ్ఇండియాకు లార్డ్స్‌లో ఓటమి ఎదురైంది. ఇంగ్లాండ్ 22 పరుగుల స్వల్ప తేడాతో గెలిచింది. ఈ 'ఓల్డ్' మైదానం పిచ్‌కూ ఐసీసీ 'సంతృప్తికరం'.. ఔట్ ఫీల్డ్‌కు 'వెరీ గుడ్' అని రేటింగ్ ఇవ్వడం గమనార్హం.

**మాంచెస్టర్‌లో భారత్ పోరాటం**

మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టులో టీమ్ఇండియా పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఐదు సెషన్ల పాటు ఇంగ్లాండ్ బౌలర్లను అడ్డుకొని మ్యాచ్‌ను డ్రాగా ముగించడంలో భారత బ్యాటర్లు అదరగొట్టారు. జడేజా, వాషింగ్టన్ సుందర్, గిల్ శతకాలు సాధించారు.ఈ పిచ్‌కు 'సంతృప్తికరం'.. ఔట్‌ఫీల్డ్‌కు 'వెరీ గుడ్' రేటింగ్‌ను ఐసీసీ కేటాయించింది.

**'ఓవల్'కు ఏమిస్తుందో..?**

బ్యాట్, బంతికి సరైన పోటీ జరిగిన మ్యాచ్ అంటే ఓవల్ టెస్టే. అప్పుడప్పుడు వర్షం ఆటంకం కలిగించినా.. చివరి రోజు వరకూ మ్యాచ్ వెళ్లింది. ఇంగ్లాండ్‌పై భారత్ 6 పరుగుల స్వల్ప తేడాతో గెలిచింది. ఈ మైదానం పిచ్‌కు ఐసీసీ ఇంకా రేటింగ్ ఇవ్వలేదు.

# 11 మంది రెజ్లర్లపై వేటు

**నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలపై డబ్ల్యూఎఫ్ఐ కన్నెర్ర**

**న్యూఢిల్లీ:** నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన రెజ్లర్లపై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కన్నెర్ర చేసింది. 11 మంది రెజ్లర్లపై సస్పెన్షన్ వేటు వేసింది. కొందరు రెజ్లర్లు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) జారీ చేసినట్లుగా నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలతో వయో విభాగాల టోర్నీలో పాల్గొనేందుకు చూస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టగా కొందరు కావాలని పుట్టిన ఏడాదిలోపు కాకుండా చాలా ఆలస్యంగా ఎంసీడీలో జనన నమోదు చేస్తున్నారు. తద్వారా తక్కువ వయస్సు విభాగంలో లబ్ధి పొందాలని చూస్తున్నారు.

విచారణలో జనన నమోదు చేసుకున్న వారిలో కొందరు ఉద్దేశ పూర్వకంగానే ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్నారని తేలడంతో డబ్ల్యూఎఫ్ఐ 11 మందిపై సస్పెన్షన్ వేటు వేసింది. సక్ష్యం, మనుజ్, కవిత, అన్షు, అరుశ్ రాణా, శుభమ్, గౌతమ్, జగ్‌రూప్ ధన్‌కర్, నకుల్, దుష్యంత్, సిద్ధార్థ్ బలియాన్‌లపై నిషేధం విధించారు. ప్రత్యేకించి రెజ్లింగ్‌లో రెండు రకాల నకిలీ పత్రాలు సమాఖ్యకు తలనొప్పిగా మారాయి. ఇందులో మొదటిది తప్పుడు వయో ధ్రువీకరణ కాగా... రెండోది ఒక ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ పత్రాలతో స్థానికత నిబంధనకు విరుద్ధంగా పోటీపడటం. హరియాణాలో రెజ్లింగ్‌కు విపరీతమైన పోటీ ఉంటుంది. కుప్పలుతెప్పలుగా ఉన్న అఖాడాల నుంచి వందల సంఖ్యలో రెజ్లర్లు తయారవుతారు. కానీ వీరంతా జాతీయ పోటీల్లో పాల్గొనాలంటే రాష్ట్రం తరపున గట్టి పోటీ ఉంటుంది. చాలామందికి అవకాశాలు రావు. దీంతో హరియాణా రెజ్లర్లు పక్క రాష్ట్రాలకు చెందిన రెజ్లర్లుగా నకిలీ పత్రాలు సృష్టించి పోటీల్లో పాల్గొంటారు. ప్రతి క్రీడలోనూ వయో విభాగాలు, జూనియర్ టోర్నీల్లో నకిలీ సర్టిఫికెట్ల బెడద వేధిస్తోంది. దీనివల్ల అర్హులైన పిన్న వయసుక్కలు నష్టపోతున్నారు.

**క్రీడా శాఖకు రెజ్లర్ తండ్రి ఫిర్యాదు**

హరియాణాకు చెందిన ఇషిక రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఢిల్లీ తరపున పోటీపడింది. దీనిపై ఢిల్లీ రెజ్లర్ రితిక తండ్రి నీరజ్ కుమార్ కేంద్ర క్రీడాశాఖకు ఫిర్యాదు చేస్తూ లేఖ రాశారు. స్థానికత నిబంధనలకు విరుద్ధంగా ఇషికను 53 కేజీల కేటగిరీలో ఢిల్లీ తరపున పోటీపడేందుకు అనుమతించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇషిక నివాస ధ్రువీకరణ పత్రాలను ఆ ఫిర్యాదుకు జతచేసినట్లు ఆయన చెప్పారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని నీరజ్ కుమార్ డిమాండ్ చేశారు.




# దాయాదుల పోరు.. ఆ రెండింటికీ పోలికే లేదు: ఎమిరేట్స్ క్రికెట్ సీవోవో

టీమ్ఇండియా వచ్చే నెల 9 నుంచి ఆసియా కప్ బరిలోకి దిగాలి. అక్కడ పాకిస్థాన్‌తో ఆడాలి. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ పాక్ మ్యాచ్ సందిగ్ధత నెలకొంది. ఇటీవలే ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో పాక్‌తో ఆడేదే లేదని టీమ్ఇండియా ఛాంపియన్స్ బహిష్కరించింది. భారత క్రికెట్ అభిమానుల్లో హర్షం వ్యక్తమైంది. ఇప్పుడు టీమ్ఇండియా కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకోవాలనేది వారి డిమాండ్. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం తాము అంతర్జాతీయ వేదికలపై పాక్‌తో ఆడేందుకు ఎలాంటి అభ్యంతరం చెప్పబోమని గతంలోనే వెల్లడించింది. ఈ క్రమంలో బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. అయితే, దాయాదుల పోరుకు ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవచ్చని ఎమిరేట్స్ క్రికెట్ అసోసియేషన్ సీవోవో సుభాన్ అహ్మద్ వెల్లడించారు.

''భారత్ పాక్ మ్యాచ్‌కు ఎలాంటి అంతరాయం ఉండదని చెబుతున్నా. అయితే, దీనిపై అధికారిక హామీ ఇవ్వమంటే ఇప్పుడే ఇవ్వలేను. కానీ, దాయాదుల పోరుకు మాత్రం ఇబ్బందుల్లేవు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌కు ఆసియా కప్‌నకు పోలికే లేదు. అది ప్రైవేటు లీగ్. ఇది అంతర్జాతీయ జట్లు తలపడే టోర్నీ. డబ్ల్యూసీఎల్‌లో పాక్‌తో ఆడకూడదని భారత ఛాంపియన్స్ నిర్ణయం తీసుకుంది. కానీ, ఇక్కడ అలా జరగదని భావిస్తున్నా'' అని సుభాన్ తెలిపారు.

**యూఏఈ వేదికగా ఆసియా కప్**

యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఆసియా కప్ జరగనుంది. భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో తలపడుతున్నాయి. లీగ్ స్టేజ్‌లోనే కాకుండా.. సూపర్ 4 దశలోనూ మరోసారి దాయాదుల పోరు జరిగే అవకాశం ఉంది. టీ20 ఫార్మాట్‌లో జరగనున్న ఈ టోర్నీ కోసం టీమ్ఇండియా ఇంకా జట్టును ప్రకటించలేదు. ఇటీవలే గిల్ నాయకత్వంలోని భారత్ ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ఆడిన సంగతి తెలిసిందే. టీ20 జట్టుకు సూర్యకుమార్ యాదవ్ సారథ్యం వహిస్తున్నాడు. గంభీర్ మార్గదర్శకంలో ఇప్పటికే టీ20 ప్రపంచ కప్‌ను నెగ్గాం. ఆ జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉన్నాడు. ఇప్పుడు రోహిత్‌తోపాటు విరాట్, రవీంద్ర జడేజా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికేశారు. ముగ్గురు స్టార్లు లేకుండా బరిలోకి దిగబోయే మొదటి టోర్నీ ఇదే కానుండటం గమనార్హం.




# సీఎస్కేను వీడనున్న అశ్విన్?..

పదేళ్ల తర్వాత ఈ సీజన్‌లో తిరిగి చెన్నయ్ సూపర్ కింగ్స్(సీఎస్కే) గూటికి చేరిన స్పినర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రయాణం ఆ జట్టుతో ఒక్క సీజన్‌కే పరిమితయ్యేలా కనిపిస్తుంది. సీఎస్కేను అతను వీడనున్నట్టు వార్తలు వైరల్ అవుతున్నాయి. తనను రిలీజ్ చేయాలని అశ్విన్ మేనేజ్‌మెంట్‌ను కోరినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అశ్విన్ గానీ, సీఎస్కేగానీ ఆ వార్తలను ఇంకా ధ్రువీకరించలేదు.అలాగే, కొట్టిపారేయనూ లేదు. అయితే, సీఎస్కే క్యాంప్‌లో తాజా పరిణామాలు చూస్తుంటే సీఎస్కేను అశ్విన్ వీడనున్నాడనే ప్రచారం సాగుతుంది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్ తాజాగా తన ఐపీఎల్ ఫ్యూచర్‌పై సీఎస్కే మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ఎం.ఎస్ ధోనీ, రుతురాజ్ గైక్వాడ్ సహా సీఎస్కే ఉన్నత అధికారులు, టాప్ ప్లేయర్లు గత కొన్ని రోజులుగా చెన్నయ్‌లో సమావేశం అవుతున్నట్టు ఓ ప్రముఖ జాతీయ మీడియా పేర్కొంది. వచ్చే సీజన్ ప్రణాళికల గురించి చర్చించినట్టు తెలిపింది.

తనను రిలీజ్ చేయాలని అశ్విన్ రిక్వెస్ట్ చేసినట్టు తెలుస్తోంది. అతను వేరే ఫ్రాంచైజీకి వెళ్లాలని చూస్తున్నట్టు కూడా జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే, ఆటగాళ్లతో మాట్లాడం ప్రీ ఆక్షన్ ప్లాన్ భాగమని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. అశ్విన్‌తో కూడా అలాగే చర్చించి ఉండొచ్చని పేర్కొన్నాయి. ప్లేయర్ల ఫ్యూచర్‌పై నిర్ణయం తీసుకోవడానికి ఇది ప్రారంభ దశ అని, రిటెన్షన్‌కు ఇంకా సమయం ఉందని తెలిపాయి. అశ్విన్ గానీ, సీఎస్కే మేనేజ్‌మెంట్‌గానీ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.2009-2015 వరకు చెన్నయ్‌కు ఆడిన అశ్విన్ ఆ తర్వాత ఇతర జట్లకు ఆడాడు. 10 ఏళ్ల తర్వాత తిరిగి సీఎస్కేలో చేరాడు. ఈ సీజన్‌కు ముందు మెగా వేలంలో చెన్నయ్ ఫ్రాంచైజీ 9.75 కోట్లకు అతన్ని తీసుకుంది. అయితే, ఈ సీజన్‌లో అశ్విన్ నిలకడగా రాణించలేదు. 9 మ్యాచ్‌ల్లో కేవలం 7 వికెట్లే తీశాడు. దీంతో కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడంతో పలు మ్యాచ్‌లకు అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు.